క్లుప్తంగా

ప్రశ్నలు వేసి.. సమాధానాలు రాబట్టి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మందమర్రిరూరల్: మండలంలోని వెంకటాపూర్(గుడిపెల్లి)లోని మండల ప్రాథమిక పాఠశాలను డీఈవో యాదయ్య గురువారం సందర్శించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు విద్యాదేవికి సూచించారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

పాతమంచిర్యాల: బీజేపీ ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్న లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 44కార్మిక చట్టాలను 4లేబర్‌కోడ్‌లుగా విభజించి ఏప్రిల్ నెల నుంచి అమలు చేయాలని బీజేపీ ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా 18న ఢిల్లీలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ట్రేడ్ యూనియన్ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు ఖలీందర్ అలీఖాన్, పౌలు, రవీందర్, రాయమల్లు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: మాదిగ అమరవీరుల స్మారక స్తూప నిర్మాణం కోసం బెల్లంపల్లిలో స్థలం కేటాయించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు కోరారు. ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు గురువారం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా నాయకులు కుశ్నపల్లి నారాయణ, రాజ్‌కుమార్, కుశ్నపల్లి రాజలింగు, గోగర్ల శేఖర్, శివాజీ, సతీష్, సారయ్య, గద్దల కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు భూమి కబ్జాకు గురికాకుండా చూడాలి



అధికారులకు సమస్య విన్నవిస్తున్న గ్రామస్తులు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని చాకేపల్లి గ్రామ శివారులోని గున్నికుంట చెరువు భూమి కబ్జాకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. గురువారం కొంత మంది చెరువు మత్తడి, కట్టను కూల్చి కబ్జాకు యత్నించగా గ్రామస్తులు, మత్స్యకారుల సంఘం సభ్యులు అక్కడి చేరుకొని ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. బెల్లంపల్లి ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జ్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) సునీత, వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్ అక్కడికి చేరుకొని కబ్జా స్థలాన్ని, చెరువును పరిశీలించారు. కబ్జా పై పూర్తి విచారణ జరిపి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఈఈ తెలిపారు. కార్యక్రమంలో చాకేపల్లి మాజీ ఎంపీటీసీ ముడిమడుగుల మహేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

రామకృష్ణాపూర్: పట్టణంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్లో బుధవారం రాత్రి పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు సిద్దయ్య, పాఠశాల డైరెక్టర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్‌కు కృషి

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని 1, 2వార్డుల ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు రూ.98లక్షల నిధులతో అదనపు 5ఎంవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ప్రారంభించినట్లు ఎస్‌ఈ ఆపరేషన్స్ గంగాధర్ తెలిపారు. గతంలో రెండు వార్డుల్లో విద్యుత్ సమస్యలు వచ్చాయని తెలిపారు. ఎలాంటి సమస్యలు రాకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్ అమర్చినట్లు పేర్కొన్నారు. డీఈ కైసర్, ఏడీఈలు బాలకృష్ణ, శరత్, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముందస్తు హోలీ వేడుకలు



తాండూర్: రంగులద్దుకుని కేరింతలు కొడుతున్న బాలికలు



వివేకానంద పాఠశాలలో హోలీ సంబురాలు



మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ కేంద్రంలో...



హోలీ సంబురాల్లో విద్యార్థులు, అధ్యాపకులు

జన్నారం/పాతమంచిర్యాల/తాండూర్/చెన్నూర్‌రూరల్/మంచిర్యాలటౌన్: జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రైవేట్ కార్యాలయాల్లో ముందస్తు హోలీ సంబురాలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. హోలీ రోజు సెలవు ఉండటంతో ఒకరోజు ముందుగా సంబురాలు చేసుకున్నట్లు తెలిపారు. జన్నారం వివేకానందా పాఠశాలలో, జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్సు కార్యాలయంలో, ఏసీసీ 3 అంగన్‌వాడీ కేంద్రంలో, తాండూర్ కస్తూర్బా విద్యాలయంలో, కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేడుకలు జరుపుకున్నారు.



సంబురాల్లో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్సు సిబ్బంది

గుట్టుగా మట్టిదందా..!





మూసి వేసిన తూము

• రాత్రిళ్లు ట్రాక్టర్లతో తరలింపు

కాసిపేట: మండలంలోని కోమటిచేను శివారులోని సల్పాలవాగు ప్రాజెక్టు కట్ట కింద కొందరు వ్యక్తులు పది రోజులుగా రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా జేసీబీ, ట్రాక్టర్లతో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. భారీ గోతులు చేయడంతో వర్ష కాలంలో ప్రాజెక్టు కట్ట పరిస్థితి ప్రమాదకరంగా మారింది. ఇన్ని రోజులుగా మట్టి దందా కొనసాగుతున్న మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ డిపార్టుమెంట్‌ల అధికారులు అటువైపు చూసిన దాఖలాలు లేవు. తూము వద్ద నీరు రాకుండా మట్టిని అడ్డుగా వేసి, సమీపంలోని నీటిలో మట్టివేసి ట్రాక్టర్లకు మార్గం ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవడంతో పాటు కట్టకు నష్టం వాటిల్లకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జిల్లా సహకార శాఖ అధికారిగా మోహన్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా సహకార శాఖ అధికారిగా బి.మోహన్‌కు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా సహకార శాఖ అధికారి డి.సంజీవరెడ్డి హన్మకొండకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆదిలాబాద్ డీసీవో బి.మోహన్‌కు ఇంచార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా కిడ్నీ దినోత్సవం

మంచిర్యాలటౌన్/బెల్లంపల్లి: ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రా రెడ్డి ఆధ్వర్యంలో, బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రాష్ట వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఏ.కోటేశ్వర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఆర్ఎంవో డాక్టర్ శ్రీమన్నారాయణ, ఆరోగ్యశ్రీ సిబ్బంది రాకేశ్, డయాలసిస్ ఇన్‌చార్జి రాహిల్, బెల్లంపల్లిలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమారి, ఆర్ఎంవో మూర్తి, నర్సింగ్ సూపరింటెండెంట్ జోస్పిన్, డయాలసిస్, ఏరియా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో...

రోగుల సేవకులకు సన్మానం

మంచిర్యాలటౌన్: ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని ఆధ్య, కిడ్నీ డయాలసిస్ సెంటర్ నెఫ్రాలజిస్టు వైద్యుడు రాకేశ్ కుమార్ చెన్న ఆధ్వర్యంలో గురువారం వినూత్నంగా జరుపుకున్నారు. డయాలసిస్ కోసం కిడ్నీ వ్యాధిగ్రస్తులను తీసుకొచ్చే రోగుల సహాయకుల సేవలను గుర్తించి, వారిని ఘనంగా సన్మానించి, బహుమతులు అందించారు. డయాలసిస్ కోసం రోగులను తీసుకురావడం, తీసుకెళ్లడంలో సహాయకులది కీలకపాత్ర అని, వారి సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఆప్తాల్మజిస్ట్ డాక్టర్ బద్రినారాయణ, యూరాలజిస్టు డాక్టర్ సుమన్, పాథాలజిస్టు డాక్టర్ సృజన పాల్గొన్నారు.



సన్మానిస్తున్న వైద్యులు రాకేశ్, బద్రినారాయణ

లైజనింగ్ అధికారికి సన్మానం

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో బీసీ లైజనింగ్ అధికారిగా నియమించబడిన ఏరియా ఎస్‌ఓటుజీఎం సత్యనారాయణను గురువారం ఆయన చాంబర్‌లో సింగరేణి బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీవైసీఎంఓ రమేష్ బాబు, అసోసియేషన్ నాయకులు ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, బ్రాంచ్ సెక్రెటరీలు బరుపటి మారుతి, బద్రి బుచ్చయ్య, ఫిట్ సెక్రెటరీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణను సన్మానిస్తున్న నాయకులు

క్రికెట్ విజేత శ్రీరాంపూర్

శ్రీరాంపూర్: రెండు రోజులుగా శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో కంపెనీ వ్యాప్తంగా పనిచేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్ శ్రీరాంపూర్– కొత్తగూడెం ఏరియాల మధ్య పోటీ జరగ్గా శ్రీరాంపూర్ ఏరియా జట్టు విజయం సాధించింది. రన్నర్‌గా కొత్తగూడెం ఏరియా జట్టు నిలిచింది. విజేతలకు శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి ఎస్కె బాజీసైదా, ఐఎన్టీయూసీ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావులు పాల్గొన్నారు.

పుస్తకాల అందజేత

శ్రీరాంపూర్: సింగరేణి రిటైర్డ్ ఏజీఎం కే. బాలభాస్కర్ సింగరేణి విద్యాసంస్థకు పలు పుస్తకాలను విరాళంగా అందజేశారు. గత నెల రిటైర్డ్ అయిన ఆయన విద్యార్థులకు ఉపయోగపడే మెకానికల్ ఇంజనీర్, మెంటల్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, బిజినెస్ మేనేజ్మెంట్, కామర్స్‌కు సంబంధించిన పలు అంతర్జాతీయ పబ్లికేషన్స్‌కు చెందిన పుస్తకాలను సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కాలజీ లైబ్రరీకి అందించారు. గురువారం వీటిని కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ద్వారా అందించారు. రిటైర్డ్ అయిన కూడా సింగరేణి పిల్లల భవిష్యత్తు కోసం తపించి పుస్తకాలను అందించడం అభినందనీయమని సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో ఆయన్ను అభినందించారు.

■ బొగ్గుబాయి వార్తలు

కాంట్రాక్ట్ ఉద్యోగులకు రూ.40 లక్షల ఇన్సూరెన్స్

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ద్వారా రూ.40లక్షల యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నట్లు శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బ్యాంకులో ఖాతా కలిగి ఉన్న వారికి ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ఈ మొత్తం ఇన్సూరెన్స్ కింద చెల్లించబడతాయని తెలిపారు. సింగరేణి కంపెనీ ఆ బ్యాంక్‌తో ఇటీవల ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు.

పాన్ కార్డుతో ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి ఉద్యోగులు ఇన్కమ్ టాక్స్ డిపార్టుమెంట్ నిబంధనల ప్రకారం పాన్‌కార్డుతో ఆధార్ కార్డును అనుసంధానం చేసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సనల్) అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంపూర్‌లో 128మంది ఉద్యోగులు పాన్ కార్డుతో ఆధార్ కార్డును అనుసంధానం చేసుకోలేదన్నారు. ఇప్పటికైనా అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నెన్నెల/వేమనపల్లి: దుకాణ యజమానులు నకిలీ విత్తనాలు, ఎరువులను రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్ రద్దు చేసి షాప్‌ను సీజ్ చేస్తామని నెన్నెలలో మండల వ్యవసాయాధికారిణి పుష్పాల సృజన, ఎస్సై ప్రసాద్, వేమనపల్లిలో ఎంఏఓ వీరన్న, ఎస్సై శ్యాంపటేల్ హెచ్చరించారు. పలు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో విత్తన ప్యాకెట్లు, ఎరువుల నిలవలు స్టాక్ రిజిష్టర్లు పరిశీలించారు. రైతులకు విధిగా రశీదు అందజేయాలన్నారు. నెన్నెల ఏఈఓ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రశీదు తీసుకోవాలని అధికారులు సూచించారు. మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతువేదికలో గురువారం తహసీల్దార్ భోజన్న, వ్యవసాయాధికారి ప్రభాకర్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ వ్యవసాయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు సలహాలు చేశారు.

బుగ్గ ఆలయ పూజారిపై వీడియో వైరల్

బెల్లంపల్లిరూరల్: మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధి బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయ పూజారి వేణుగోపాల్ శర్మపై ఓ మహిళ విడుదల చేసిన వీడియో వైరల్‌గా మారింది. ఇటీవల ఆలయ సమీపంలో కొబ్బరికాయలు అమ్ముకుంటున్న క్రమంలో దురుసుగా ప్రవర్తించాడని, వేధింపులకు గురి చేశాడని ఆరోపించింది. తనపై దాడికి యత్నించాడని, వరంగల్ దేవాదాయ శాఖలో ఫిర్యాదు చేశానని పేర్కొంది.

పెండింగ్ డీఏ, పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

భీమారం: ఉపాధ్యాయులు, ఉద్యోగులకు వెంటనే డీఏతో పాటు పీఆర్సీలను వెంటనే ప్రకటించాలని తపస్ మండల అధ్యక్షుడు గొర్రె సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగులు అభద్రతా భావనలో ఉన్నారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. తపస్ నాయకులు భీమనాథ మహేష్, దుర్గం చందు, ఏలే విజయ్‌కుమార్, సునీత పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మిత్రుల ఔదార్యం

దండేపల్లి: మంచిర్యాలకు చెందిన నాగరాజు, తిరుపతి ఇద్దరు సోదరులు గత రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాలకు దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వారితో పదోతరగతి చదివిన 2005 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు రూ.20వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందించి తమ ఔదార్యం చాటుకున్నారు.

పాఠశాల సందర్శన

దండేపల్లి: ట్విన్నింగ్ కార్యక్రమంలో భాగంగా దండేపల్లి మండలం ద్వారక జెడ్పీ ఉన్నత పాఠశాలను, పాఠశాల సమీపంలోని లక్ష్మీకాంతపూర్, మాదాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 6, 7తరగతుల విద్యార్థులు గురువారం సందర్శించారు. పాఠశాలలోని సైన్స్‌ల్యాబ్‌ను సందర్శించారు. సైన్స్ ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు ల్యాబ్ పరికరాల గురించి వివరించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం చిన నర్సయ్య, సీఆర్పీ సురేందర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి

లక్సెట్టిపేట: విద్యార్థులు అంతర్గత నైపుణ్యాన్ని మెరుగు పర్చుకొని, భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ప్రముఖ సైకాలజిస్టు సత్యప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు చేశారు. మంచి చదువులు చదివి ఉన్నత హోదాలో ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ రమాకళ్యాణి, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

చెన్నూర్: పట్టణంలోని ఎస్‌జీవీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన 32మంది విద్యార్థులు సాంఘిక సంక్షేమ గురుకులాల ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ చల్లా సుధాకర్ రెడ్డి తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

మందమర్రిరూరల్: శ్రీరాంపూర్‌కు చెందిన సీనియర్ కరాటే మాస్టర్ భూమయ్య ప్రమాదానికి గురై అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు రూ.25వేలు సేకరించి గురువారం భూమయ్యకు అందజేశారు.

'అంబేద్కర్ విగ్రహంపై దాడి హేయమైన చర్య'

జన్నారం: జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం నగునూరులో అంబేద్కర్ విగ్రహంపై దాడి చేసి అవమాన పర్చడం హేయమైన చర్య అని అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు సిటుమల్ల భరత్ కుమార్ ఆరోపించారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ సంఘం, వివిధ దళిత సంఘాల ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, విగ్రహం ఎదుట నిరసన తెలిపారు.

ప్రవర్తనలో మార్పు రావాలి

దండేపల్లి: రౌడీషీటర్లు తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకొని మంచిపేరు తెచ్చుకోవాలని, ప్రవర్తనలో మార్పు వస్తే రౌడీషీటర్ ఎత్తివేస్తామని లక్సెట్టిపేట సీఐ నరేందర్ తెలిపారు. దండేపల్లి పోలీస్‌స్టేషన్లో పలువురు రౌడీషీటర్లకు గురువారం ఎస్సై తహసీనొద్దీన్‌తో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు.

పంట పొలాల సందర్శన

భీమారం: మండలంలోని పోతన్‌పల్లి, భీమారం గ్రామాల్లో వరిపొలాలను గురువారం ఏవో అత్తె సుధాకర్ సందర్శించారు. వరిపైరుకి ఎండుతెగులు సోకినట్లు గుర్తించారు. పంటలకు సంవృద్ధిగా నీటిని అందించాలని రైతులను కోరారు. ఏఈవో అరుణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

17, 18న కలెక్టరేట్ ఎదుట ధర్నా

చెన్నూర్: అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17, 18తేదీల్లో కలెక్టర్ కార్యాలయం ఎదుట 48గంటల ధర్నా చేపడుతున్నట్లు ఐసీడీఎస్ కార్యాలయ ఉద్యోగి రాజేందర్‌కు లేఖ అందజేసినట్లు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి శారద తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. ధర్నాకు టీచర్స్, హెల్పర్స్ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రవీణ, పద్మలత, అమృత, స్వరూపారాణి పాల్గొన్నారు.



లేఖ అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జన్నారం: అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి దిష్టి బొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. స్పీకర్‌ను క్షమాపణలు కోరి, వారి వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, సీనియర్ నాయకులు శంకరయ్య, రమేశ్, ఇందయ్య, సతీశ్, అజార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

మందమర్రిరూరల్: పట్టణంలోని పాలచెట్టు ఏరియా సమీపంలో ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సంకె రవి డిమాండ్ చేశారు. డబుల్ బెడ్రూం గురువారం ఇళ్లను సందర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గోమాస ప్రకాష్, పున్నం, చందు, శ్రీనివాస్, అశోక్, రంజిత్, కుమార్, ఉమారాణి, భాగ్య, నిర్మల ఉన్నారు.

భయం వీడితేనే విజయం

చెన్నూర్: విద్యార్థులు పరీక్షల భయాన్ని వీడితే విజయం సొంతమవుతుందని ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సుకు కిష్టంపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్వర్ధన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రీనివాస్, రామకృష్ణ, మోటివేషనల్ స్పీకర్ మేకల రామస్వామి హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

చేపలు దొరికేనా.. ఆకలి తీరేనా

దండేపల్లి: ఆకలితో ఉన్న కొంగలు చేపల వేటకు బయల్దేరాయి. ఈ క్రమంలో దండేపల్లి మండలం ముత్యంపేట సమీపంలో నీళ్లు అడుగంటిన చెరువు కనిపించడంతో, అందులో చేపలు దొరికితే ఆకలి తీరుతుందేమో అని ఆరాటపడుతున్న కొంగల సమూహాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

